## క్లుప్తంగా

### బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



తహసీల్దార్‌ను సన్మానించిన దృశ్యం

**కోవెలకుంట్ల:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోవెలకుంట్ల తహసీల్దార్ పుష్పకుమారి చిత్తూరు జిల్లా కార్వేటినగర్‌కు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో అదే జిల్లాలోని ఎస్ ఆర్ పురం తహసీల్దార్ జయప్రకాష్‌ను నియమించడంతో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. నూతన తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ రాంనాథరెడ్డి, వీఆర్‌ఓలు చెన్నయ్య, నాగమద్దిలేటి, సుబ్రహ్మణ్యం, లక్ష్మినారాయణ, మద్దిలేటి తదితరులు పూలమాలతో సత్కరించి స్వాగతం పలికారు.

### సన్మానం



రమేష్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**బేతంచెర్ల:** పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ధ్యాన పిరమిడ్ కేంద్రంలో లైఫ్ రక్త సహాయ బృందం కన్వీనర్ రవి కుమార్, సభ్యులు నాగ సురేంద్ర ఆధ్వర్యంలో విద్య, వైద్య రంగాలతో పాటు స్వచ్ఛంద సంస్థలకు తోడ్పాటు అందిస్తున్న రమేష్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. రమేష్ కుమార్ అమెరికాలో ఉంటూ తనవంతుగా పేదలకు తోడ్పాటు అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పారిశ్రామిక వేత్తలు గౌరు రామిరెడ్డి, మల్లు హుసేన్‌రెడ్డి, భువనేశ్వరరాజు కొనియాడారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సభ్యులు వన్నూర్ బాషా, గౌస్, అనిఫ్, ఆపతి మద్దయ్య, లక్ష్మన్, వరప్రసాద్ ,శ్రీను, రాజారావు పాల్గొన్నారు.

### పరామర్శ



ఏఎస్ఐ కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న గుండం శేషిరెడ్డి

**బనగానపల్లె :** మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి బైక్ ప్రమాదంలో గాయపడి వైద్య సౌకర్యం పొందుతున్న విషయం తెలిసిందే. ఆయనను వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి బుధవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండ్ల సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ జయప్రకాష్

**కోవెలకుంట్ల:** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ జయప్రకాష్ పరిశీలించారు. వసతులను తనిఖీ చేశారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్‌ఓలు ఉన్నారు.

**పోలింగ్ కేంద్రాల తనిఖీ**

**ప్యాపిలి:** పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. స్థానిక కిందిగేరి, మధ్యగేరి, బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అదేవిధంగా బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ర్యాంపులు లేని కేంద్రాల్లో వెంటనే ఏర్పాటు చేయాలని సిబ్బందికి తహసీల్దార్ సూచించారు.

### సంజామల ఎస్ఐగా రమేష్ రెడ్డి



**సంజామల:** సంజామల పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రమేష్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. రానున్న సార్వత్రికల ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐల బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వర్తించే ఎస్ఐ ప్రతాప్ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొలిమిగుండ్లల పని చేస్తున్న ఎస్ఐ రమేష్ రెడ్డి విధుల్లో చేరారు.

### డోన్ తహసీల్దార్‌గా మాధవకృష్ణారెడ్డి

**డోన్ రూరల్ :** డోన్ తహసీల్దార్‌గా బుధవారం మాధవకృష్ణారెడ్డి బాధ్యతలు చేట్టారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీలలో భాగంగా ఈయన పులివెందుల నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను కార్యాలయం సిబ్బంది పూలమాలతో అభినందనలు తెలిపారు.

# తిమ్మాపురం... అభివృద్ధి బాట

- మౌలిక వసతులతో కళకళలాడుతున్న వైనం
- మజరా గ్రామం జిల్లెల్లలోనూ రూ.1.25 కోట్లతో సీసీ రోడ్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



తిమ్మాపురంలో నిర్మించిన గ్రామ సచివాలయం



జిల్లెల్లలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

**బనగానపల్లె :** ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పట్టణాలతోపాటు గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయి. పంచాయతీలే కాదు మజరాలు సైతం కళకళలాడుతున్నాయి. మౌలిక వసతుల కల్పనతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్ల నిర్మాణాలతో పల్లెలకు పట్టణ శోభ సంతరించుకుంది. మండలంలోని తిమ్మాపురం గ్రామ పంచాయతీకి సకల వసతులు సమకూరాయి. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో తిమ్మాపురం,జిల్లెల్ల గ్రామాలు ఉన్నాయి. ఇక్కడి జనాభా సుమారు 4వేలు ఉంటుంది. ఎమ్మెల్యే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరువతో ఈ గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపురం గ్రామంలో సుమారు రూ.1.59 కొట్లతో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, మంచి నీటి సౌకర్యం సీసీ రోడ్లు కల్వర్ట్ సైడ్‌వాల్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. అదేవిధంగా జిల్లెల్ల గ్రామంలో రూ.1.25 కోట్లతో ఏకంగా పది సీసీ రోడ్లు, రూ. 5 లక్షలతో తాగు నీటి సౌకర్యార్థం శుద్ధజల కేంద్రం రూ.28లక్షలతో కల్వర్ట్ ఏర్పాటు మరిన్ని అభివృద్ధి పనులు ఏర్పాటు చేయడం జరిగింది. ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలు తీరడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.




**జిల్లెల్ల గ్రామంలో తొలగిన సమస్యలు**

తిమ్మాపురం పంచాయతీ మజరా గ్రామమైన జిల్లెలో ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో తీరాయి.



తిమ్మాపురంలోని రైతుభరోసా కేంద్రం

ఏకంగా రూ.1.25 కోట్లతో పది సీసీ రోడ్లు నిర్మించడంతో రహదారి సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రత్యేకించి జిల్లెల్ల, సుబ్బరాయుని కొత్తూరు గ్రామాల మధ్య రూ.28లక్షలతో కల్వర్ట్ నిర్మాణం పూర్తయ్యింది. దీంతో ఆయా గ్రామాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. గతంలో వాగు మూలంగా రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. కల్వర్లు నిర్మాణంతో ఏళ్లతరబడి నెలకొన్న సమస్య తీరింది.

**తిమ్మాపురం గ్రామాభివృద్ధికి చేసిన నిధుల వివరాలు...**

- రూ. రూ.35లక్షలతో సచివాలయం నిర్మాణం
- రూ.20లక్షలతో రైతుభరోసా కేంద్రం
- రూ.5లక్షలతో మినరల్‌వాటర్ కేంద్రం
- రూ.5లక్షలు అంగన్‌వాడీ భవనం నిర్మాణం
- రూ.14లక్షలతో కల్వర్టు నిర్మాణం
- రూ.9లక్షలతో సైడ్‌వాల్ నిర్మాణం
- రూ.60లక్షలతో సీసీ రోడ్లు
- రూ.10లక్షలు ఇతర అభివృద్ధి పనులు

**జిల్లెల్ల అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు**

- రూ.1.28 కోట్లతో పది సీసీ రోడ్లు
- రూ.28లక్షలతో కల్వర్లు నిర్మాణం
- రూ.5లక్షలతో శుద్ధజల కేంద్రం

### గ్రామంలో సమస్యలు తీరాయి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో గ్రామంలో నెలకొన్న సమస్యలు తీరాయి. గత ప్రభుత్వంలో సమస్యల పరిష్కారం కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారం. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ప్రత్యేకించి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఏర్పాటు ఎంతో సౌకర్యంగా ఉంది. మండల కేంద్రానికి వెళ్లాల్సిన తిప్పలు తప్పాయి. ఎరువులు, విత్తనాలు ఇక్కడే లభిస్తున్నాయి. చాలా సంతోషంగా ఉంది.
– అల్లె సురేష్‌రెడ్డి, తిమ్మాపురం

### రహదారుల సమస్య తీరింది



గతంలో గ్రామంలో రహదారుల సమస్యలతో చాలా ఇబ్బందులు పడ్డాం. వర్షాకాలం మరీ ఇబ్బందిగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి వీధిలో సీసీ రోడ్డు ఏర్పాటు అయ్యింది. తాగునీటి కోసం ఫిల్టర్‌వాటర్ సౌకర్యం కల్పించారు. ఏళ్లతరబడి ఇబ్బంది పడుతున్న కల్వర్ట్ సమస్య తీరింది. కల్వర్లు నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుంది.
–ఎం శంకర్‌రెడ్డి, జిల్లెల్ల గ్రామం

### ఎమ్మెల్యే కాటసాని సహకారంతో అభివృద్ధి



స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో తిమ్మాపురం, జిల్లెల్ల గ్రామాలను అభివృద్ధి చేశాం. తాము విన్నవించిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే కాటసాని పరిష్కరించారు. ఆయన సహకారంతో ఈ రెండు గ్రామాలను అభివృద్ధి చేయగలిగాను. ప్రత్యేకించి రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారం సంతృప్తినిచ్చింది. ఈ గ్రామాల ప్రజల తరుపున ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.
–అల్లె సుప్రజ, సర్పంచ్, తిమ్మాపురం

### వ్యవసాయ, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుపై హర్షం



మంత్రి బుగ్గనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దంపతులు

**డోన్:** నంద్యాల జిల్లా డోన్‌లో కొత్తగా ప్రభుత్వం హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు నిర్ణయంపై మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైఎస్ ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు సుమిత్ర రాజేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు వారు తెలిపారు. విద్య, వైద్య, రంగాలతో పాటు వ్యవసాయ రంగంలో కూడా డోన్ మరింత అభివృద్ధి సాధించే అవకాశం ఉందని వారు చెప్పారు.

### ఉపాధి పనులను ప్రారంభించాలి

**బేతంచెర్ల:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించాలని ఎంపీడీఓ రవి ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఫారంపాండ్స్, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించి, జిల్లా స్థాయి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అంతకుముందు నూతన ఎంపీడీఓ రవి ప్రసాద్‌కు ఉపాధి సిబ్బంది అభినందనలు తెలిపారు.

### నేడు కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా

**బనగానపల్లె రూరల్ :** మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో గురువారం కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌లతో పాటు వ్యవసాయ అధికృత డీలర్లు, అగ్రికల్చర్ విద్యార్థులు రైతులు పాల్గొంటారని వివరించారు.

## అభివృద్ధి పథంలో మారుమూల గ్రామాలు

**ప్యాపిలి:** వైఎస్సార్‌సీపీ పాలనలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి పథం వైపు సాగుతున్నాయని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఎంపీపీ గోకుల్‌లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలో బుధవారం రూ. 26 లక్షలతో వేసిన సీసీ రోడ్డు, రూ. 38.4 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 23.94 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, రూ. 12 లక్షలతో ఏర్పాటు చేసిన శ్మశానవాటిక ప్రహరీలను బుధవారం వారు ప్రారంభించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచ్ ముడిమాల మహేంద్రమ్మ, ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి, ఎంపీడీఓ సాయిమనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి రావడంతో పల్లెలకు పట్టణ శోభ సంతరించుకుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ రాజేశ్, పీఆర్ఏఈ ప్రభాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ శంకర్ రెడ్డి, ఏనుగుమర్రి సర్పంచ్ మదన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోరెడ్డి రాము, గడ్డం భువనేశ్వర్‌రెడ్డి, నేరేడుచెర్ల చంద్రశేఖర్ రెడ్డి, చంద్రకళాధర్ రెడ్డి, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సోమశేఖర్, నాగపురుషోత్తం రెడ్డి, విఘ్నేశ్వర్ రెడ్డి, శివారెడ్డి, యాగంటి, లోకేశ్వర్ రెడ్డి, సుబ్బన్న, పెద్దకుల్లాయి, రమణ, తిరుపతి రెడ్డి, రామనాథం, వంశపారంపర్య ధర్మకర్త మెట్టు రామలింగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

### ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

**కోవెలకుంట్ల:** ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి, డిపోమేనేజర్ తిరుపతయ్య తెలిన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకోవన్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమన్నారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించి రాకపోకలు సాగించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణదాసు, రాజశేఖర్, భాస్కర్‌నాయక్, రాజు, అసిస్టెంట్ డిపోమేనేజర్ శేఖర్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ తిరుపతయ్య

### ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జయచంద్ర

**కోవెలకుంట్ల:** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని కలుగొట్ల గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వబోమన్నారు. శాంతి భద్రతలకు భంగం కల్పించే వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల, రేవనూరు ఎస్ఐలు వరప్రసాద్, రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### 14 బుక్కాపురంలో విగ్రహాల ప్రతిష్ట

**బేతంచెర్ల:** మండల పరిధిలోని ఆర్ బుక్కాపురంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 12 నుంచి 14 వరకు గణపతి, సీతారామ లక్ష్మణ, హనుమత్, ధ్వజ, నాభిశిల, నవగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 12న గణపతి పూజల, పుణ్యాహవాచనం, కంకణ ధారణ, ప్రత్యేక పూజలు, 13 విగ్రహాల గ్రామోత్సవం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, మహామంగళ హారతి ఉంటుందన్నారు. అదేవిధంగా 14న ఉదయం 7:30 గంటలకు హోమాదులు, అభిషేకం, 10:43 మేషలగ్నం యంత్ర, విగ్రహ ప్రతిష్ఠలు ఉంటాయని వివరించారు. అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహిస్తామని వివరించారు.

## పాడి రైతులను చైతన్య పరచాలి

**బనగానపల్లె రూరల్ :** పాడి రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని వివరించి చైతన్న పరచాలని జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ గోవింద్‌నాయక్ సిబ్బందికి సూచించారు. బనగానపల్లె పశు సంవర్థకశాఖ కార్యాలయంలో గురువారం ఆళ్లగడ్డ డివిజన్‌లోని పశుసంవర్ధక శాఖ వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువైద్యాధికారులకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పాడి రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు సబ్సిడీ పథకాలపై పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్ పశు బీమా ద్వారా 80శాతం సబ్సిడీతో పశువులు, గొర్రెలు, మేకలకు బీమా సౌకర్యం కల్పించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ డివిజన్ ఉపసంచాల కులు డాక్టర్ రమణయ్య, పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ రాజశేఖర్, ఏడీఏ మారుతినకారామ్, పశువైద్యులు రామ్‌కుమార్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చిన్నబాబు, రాఘవేంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భారతీదేవి, ఐశ్వర్య, గిడ్డయ్య, కొండారెడ్డి, వరప్రసాద్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోవింద్‌నాయక్

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

**డోన్ రూరల్ :** పట్టణాలతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కమలాపురంలో బుధవారం నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అంకితభావంతో డోన్‌ను మోడల్ నియోజకర్గంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. మంత్రి బుగ్గన చొరువతో కమలాపురంలో రూ.35లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రజల వద్దకు పాలన లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ఉన్న గ్రామాల్లోనే సేవలు అందజేస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందజేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వాదించాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అర్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, నాయకులు బొబ్బల శివరామిరెడ్డి, బుగ్గన జయచంద్రారెడ్డి, చిరంజీవి, బుగ్గన్న మధుసూదన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బుగ్గన మహేశ్వరరెడ్డి, ఏఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కమలాపురం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీహాల్ శిలాఫలకాన్ని అవిష్కరిస్తున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

**మల్యాలలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభం**

మండల పరిధిలోని మల్యాలలో రూ.25లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్సీ కమ్యూనిటీహాల్‌ను సర్పంచ్ రామలక్ష్మమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డితో కలిసి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా కొచ్చెర్వు గ్రామంలో రూ.22లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. గోసానిపల్లి గ్రామంలో రూ.32లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.22లక్షలతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ మోహన్, చంద్రశేఖర్, అశోక్, గోసానిపల్లి సర్పంచ్ బాలమ్మ, నాయకుడు మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

**మద్యం బాటిళ్లు స్వాధీనం**

**కోవెలకుంట్ల:** మండలంలోని పెద్దకొప్పెర్ల గ్రామ శివారులో బుధవారం బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రేవనూరు ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం నుంచి 28 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

**చైర్మన్‌ను కలిసిన కమిషనర్**

**డోన్ టౌన్ :** డోన్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ బుధవారం మర్యాద పూర్వకంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. చైర్మన్ రాజేష్ కూడా కమిషనర్‌కు ఓ మెక్కను అందజేసి స్వాగతం పలికారు.

**తిరుపతి, బెంగుళూరుకు బస్సులు నడపాలి**

**డోన్ టౌన్ :** డోన్ ఆర్టీసీ డిపో నుంచి ప్రముఖ పుణ్య క్షేత్రమైన తిరుపతికి, సాఫ్ట్ వేర్ ఉద్యోగవకాశాలు ఉన్న బెంగళూరు నగరాలకు బస్సులు నడపాలని ప్రజలు కోరినట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. స్థానిక కొత్త బస్టాండ్‌లో బుధవారం సాయంత్రం ఆయన డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రజలు అడిగిన వాటికి సమాధానం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. తిరుపతి, బెంగళూరుకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా డీఎం చెప్పారు.

## ఉపయోగకర పనులు గుర్తించండి

**కోవెలకుంట్ల:** జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రజలు, రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలని ఆ పథకం ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ మగ్బుల్ సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో పనుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పంటకాల్వలు, చెరువులు, కుంటల్లో పూడికతీత, పొలాలకు వెళ్లే రస్తాలు తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు జయభారత్‌రెడ్డి, ఫక్రుద్దీన్, రాధాదేవి, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈసీ మగ్బుల్

## జెడ్పీ చైర్మన్‌ను సన్మానించిన ఎస్సీ కాలనీ వాసులు



జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని సన్మానిస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

**కొలిమిగుండ్ల:** బెలుం గుహల సమీపం నుంచి బెలుం శింగవరం రోడ్డు వరకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో బుధవారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని బెలుం ఎస్సీ కాలనీ వాసులు సన్మానించారు. సుబ్బరాయుడు,శేఖర్ ఆధ్వర్యంలో కాలనీవాసులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీ చైర్మన్ ప్రత్యేక చొరవతో రూ.1.27 కోట్లతో నిర్మిస్తున్నారని కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మించాలని చైర్మన్‌ను ఎస్సీ కాలనీవాసులు కోరారు. స్పందించిన ఆయన స్థలాన్ని ఎంపిక చేసుకుంటే జెడ్పీ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దానమయ్య, తోక బాలుడు, కంబయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### 12 నుంచి విగ్రహాల ప్రతిష్ట ఉత్సవాలు

**కొలిమిగుండ్ల:** పెట్నికోట ఎస్సీ కాలనీలో ఈనెల 12నుంచి మూడు రోజుల పాటు సీతారాముల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలు సాగుతాయని నిర్వాహకులు తెలిపారు. టీటీడీ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో రూ.30 లక్షలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 14న సీతారాముల విగ్రహాల ప్రతిష్ట జరుగుతుందన్నారు.

**14న రాష్ట్ర స్థాయి భజన పోటీలు**

సీతారాముల విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే భజన బృందాలు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన భజన బృందాలకు మొత్తం 27 నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ బహుమతులు వరుసగా రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.12వేలు చొప్పున అందజేస్తామన్నారు. అదేవిధంగా ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని ఏర్పాటు చేశామని వివరించారు.